# సంస్కారి

భర్తకు వేళకు వంటచెయ్యాలనే తొందరలో తొమ్మిది గంటలకే వంట ముగించి, పూజలోకి దిగింది, జగదీశ్వరి. నోటికి వచ్చిన పాటేదో శ్రావ్యంగానే పాడి, పూజజేసి, నైవేద్యం పెట్టి భర్తకోసం పీటా, కంచం, మరచెంబుతో నీళ్ళూ, అన్నీ సమకూర్చసాగింది.

జగదీశ్వరికి నలభై ఏళ్ళు నిండినా, శరీర పటుత్వాన్ని బట్టిముప్ఫైఏళ్ళైనా వుంటాయనుకోరు ఎవరూ! అయితే నేం? ఎన్నివ్రతాలూ పూజలూ చేసినా, సుశీల తర్వాత, పిల్లలే కలగలేదు. సుశీలైనా కాపరానికి వచ్చిన పదేళ్ళకు కలిగింది. మళ్లీ పిల్లల్లేరు.

అందుకని పంచప్రాణాలుకూతురిమీదేవుంచి, భర్తతో కాపరం చేస్తోంది.

పదిగంటలయింది. అప్పటికి తన భర్త ఇంకా భోజనానికిరాలేదు. మధ్యగదిలోకివెళ్ళి మృదుమధురస్వరంతో "వంటయింది" అంది. ఆఫీసులో లా పుస్తకాలమధ్య వున్న రాఘవరావు "ఆ" అన్నాడు.

జగదీశ్వరి వంటింట్లోకి వెళ్లి దీపపువత్తులు చేసుకోసాగింది.

పోస్టుమాన్ ఏదో టెలిగ్రాం ఇచ్చి వెళ్లిపోయాడు' అతనికి రోజూ ఒకటో, రెండో టెలిగ్రాంలు రాక మానవు' ఏదో కేసుల సంబంధమైనవి.

తీరా భోజనానికి లేచేముందు దాన్ని చించి, చూచి నిశ్చేష్టుడైపోయాడు."అల్లుడికి ప్రమాదంగావుంది. వెంటనే రండి" అని దాని సారాంశం.

దాన్ని తీసుకుని వంటింట్లోకి వెళ్ళాడు. ఆ వార్తని భార్యకు ఎలా నివేదించాలో తెలీక చాలా తికమకపడ్డాడు. "అల్లుడికి జబ్బు చేసిందట" అని గొణిగాడు.

"ఏమిటీ?" అని ఆశ్చర్యపోయింది. జగదీశ్వరి "ఇప్పుడే టెలిగ్రాం వచ్చింది". అన్నాడు రాఘవరావు రోజారంగు కాగితాన్ని చూపుతూ.

జగదీశ్వరకి ఒకక్షణం నోటిమాట రాలేదు. నిలువునా వణకసాగింది. కళ్ళు రాలని బాష్పాలతో నిండాయి.

'హా, దైవమూ' అని కూలబడింది. పిల్లలు చాలా కాలం వరకు కలగకపోతే,

మాతృత్వాన్ని దైవభక్తిగా మార్చుకుని, ఎన్నో పూజలూ పునస్కారాలూ చేయించింది; అందువల్లే సుశీల కలిగిందని కూడా ఆవిడ నమ్మకం.

"ఏం భయపడకు, అదే తగ్గుతుందిలే!" అన్నాడు, పరిషేచనం చేస్తూ.

"ఈ వేళ మనం వెళ్ళాలి. అమ్మాయి, ఏం బెంగపెట్టుకుంటుదో" అంది జగదీశ్వరి ఆలోకాలధ్వనితో

"సరే, కానియ్యి" అన్నాడు భర్త.

ఆవేళే అక్కడికిచేరారు. కాని, పాపం, వాళ్ళువెళ్ళేటప్పటికే అంతా ఆఖరయింది "గుండెలు చెప్పకుండానే ఆగిపోయాయి", అన్నారు అక్కడివాళ్లు.

సుశీలను దగ్గరికి తీసుకున్నప్పుడు, "అమ్మా, నాన్నా, నాగతేమిటి?" అని ఏడవసాగింది.

జగదీశ్వరికి గుండె చెరువైంది. కాళ్లు నరికివేయబడ్డాయా? అనుకుంది. ఇరవై ఏళ్ళయినా నిండని కూతురికి వైధవ్యం సంప్రాప్తమైంది. నాలుగేళ్ళన్నా కాపరంచేసిందో లేదోగాని ఆ పాడుదైవం దాన్ని అనాథను చేశాడు. కూతుర్ని చేరదీసుకుని జగదీశ్వరి గుండెచెక్కలయ్యేలా ఏడవసాగింది.

రాఘవరావు మనస్సులోనే కృంగిపోయాడు; పైకి మాత్రం ఏమీఅనలేదు; కళ్ళవెంబడి కన్నీటిప్రవాహం ఆగకుండా ప్రవహించసాగింది.

వాళ్ళ నియ్యంకుల, బంధువుల రోదనాలతో భూనభోంతవాళాం దద్దరిల్లసాగాయి. చేతికి అందివచ్చిన, నాలుగు రాళ్లు సంపాదిస్తున్న కొడుకు పోయాడు; ముసలితనంలో అనంతమైన కష్టంవచ్చింది! ఏం చేస్తారు, ఏడవడం తప్ప?

## 2

అయినా కూతురి దురదృష్టానికి కృంగిపోతూ, ఇంటికి తీసుకువచ్చి ఎంతో గారాబంతో పెంచుకోసాగింది, జగదీశ్వరి. పెంచసాగిందన్న మాటేగాని, దాని భవిష్యత్ తల్చుకున్నపుడల్లా చెప్పలేని బాధని పొందేది. కన్నకూతురే కంటిలోని నలుసై బాధిస్తున్నట్టయింది.

ఏమిటి దానికిమార్గం? తను బ్రతికివున్నవాళ్ళు ఫరవాలేదుగాని, తర్వాత తండ్రికి కావాలా? ఆయనతర్వాత మాట? అంతా అగమ్యగోచరంగా తోచేది.

సుశీలని ఏమీ పనిచెయ్యనిచ్చేది కాదు ఎవరైనా ఏసమయంలో అయినా ఏం తెలివితక్కువ మాటలు మాట్లాడి దాన్ని బాధిస్తారో! అని భయపడేది.

భర్తతో చెప్పి ఏవేవో పుస్తకాలూ, పత్రికలూ తెప్పించేది. లేసులల్లటం, ఎంబ్రాయిడరీ కుట్టడం, నేర్పేది. ఏదో విధంగా కూతురికి కాలక్షేపం కల్పించి, మనస్సుని దు:ఖం మీదనుండి మళ్ళించి, సుఖపెట్టాలనుకునేది.

చుట్టుపక్కల నూత్న దంపతుల్ని చూస్తుంటే, తన కూతురి కాపరం నట్టేట కల్సిందికదా అని బాధపడేది.

ఎవళ్ళైనా పెళ్ళి పిలుపులకు, పేరంటాలకు పిలవ వచ్చినా, జగదీశ్వరినే పిల్చేవారుకాని, సుశీలవైపు చూసే వారుకాదు. అదంతా జగదీశ్వరికి తలతీసినట్టనిపించేది.

## 3

రాఘవరావుకూడా కూతురికి సంభవించిన దారుణ ఘాతానికి ఎంతో కుమిలిపోయాడు. కాని మగవాడైన మూలాన, కొద్దిరోజుల్లోనే ఆ దు:ఖాన్ని హృదయంలో ఒక మూలకి త్రోసివెయ్యకలిగాడు. తర్వాత పూర్తిగా మర్చిపోయాడేమో కూడా.

రాఘవరావు రాజకీయ జీవిలా అందరికీ కన్పిస్తాడు. గొప్ప సంస్కర్త అని కూడా అందరూ అభిప్రాయపడతారు. అసలు వృత్తి ప్లీడరీ, సెలవుల్లో వ్యవసాయం. అయినా మూడు వందల - అరవై - ఐదు - రోజుల రాజకీయవేత్తలా నటించగలడు. ఖద్దరు కడతాడు సభలకు హాజరవనూ అవుతాడు; ఉపన్యాసాలు ఇవ్వనూఇస్తాడు. పేపర్లో పేరువస్తూనే వుంటుంది. ఒక్కమాటలోచెప్పాలంటే అతన్ని ఆవూళ్ళో అందరూ విజ్ఞానసర్వస్వంగా భావిస్తారు. ఒకవేళ ఎవరైనా తెలివిమీరి అతని దగ్గర మాట్లాడానికి సాహసిస్తే, ఏదో ఎవరూ పేర్లుకూడా వినని పుస్తకాలనుండి నాలుగు వాక్యాలుచెప్పి నోరు మూయించే శక్తి సామర్థ్యాలు కలవాడు.

హరిజనోద్ధరణ, హరిజనదేవాలయప్రవేశం, సహపంక్తి భోజనాలు, భూదాన శ్రమదానాల ఉద్యమాలు మొదలైన అనేక సంస్కరణలను బాహాటంగా ప్రవేశపెట్టి సంస్కార హృదయుడనిపించుకున్నాడు. ఆ వూళ్ళో చందాలు వసూలు చేసేడు శరణాలయాలు కట్టించాలని.

ఒకనాడు భోజనం చేస్తున్నాడు. భార్య పక్కని కూచుని వడ్డిస్తోంది. కూతరు దొడ్లో ఎక్కడో నీళ్లు పోస్తోంది మొక్కలకి.

"ఏమండీ?"

"ఏం?"

"ఒక్క విషయమడుగుతా చెపుతారా?"

"ఏమిటదీ?"

"మరేమో... మీరేమీ అనుకోనంటే..."

"లేదులే... చెప్పు"

"ఉ!"

"మన అమ్మాయికి.... మళ్ళీ పెళ్ళి చేస్తేనో!"

తన నోటివద్దకు తెచ్చుకున్న ముద్దను మధ్యలోనే ఆపాడు, ఆలోచిస్తున్నట్టు.

"ఏమంటారు?" అంది జగదీశ్వరి కన్న కడుపుతీపికొద్దీ.

"నీ కీ ఆలోచన తోచినందుకేచెప్పాలి! అసలు యిలాంటి పని మనవంశంలో ఎక్కడైనా జరిగిందా? మనింటావంటాలేని అపఖ్యాతిపాలు చెయ్యాలని చూస్తున్నావా? ఇంతకు నీకూతురు శీలాన్ని కాపాడుకోలేనిదైతే ఎవరితోనైనా లేచి పొమ్మను; నాలుగురోజులు మనకి పుట్టలేదనుకుని తలవంచుకుని బ్రతకొచ్చు.

"నే నదేమీ అనలేదండీ... పోనీ మంచిదికాదనుకుంటే ... ... ..." జగదీశ్వరి మధ్యలోనే ఆపింది. ఇంక సంభాషణ సాగనేలేదు. జగదీశ్వరికి సుశీల భవిష్యత్తు శేషప్రశ్నే అయింది.

**4**

జగదీశ్వరి కూతురిమీద బెంగతో పూర్తి ఆరోగ్యాన్ని కోల్పోయి, జబ్బుపడ్డంతో రాఘవరావుకి మనస్సులో అశాంతి కలుగసాగింది. మంచి డాక్టర్లను పిలిపించాడు వాళు ళ ఎన్నో మందులివ్వసాగారు. టైఫాయిడ్ అన్నారు. కాని మానసిక రోగానికి మందు లేం పనిచేస్తాయి? ఆ రోజు జబ్బు తీవ్రమైంది. అందరూ చేరారు.

అతన్ని భార్య పిలిచి, చావు తెలివిరాగా "మీరే దాని భవిష్యత్తును చూడాలి. పాపం! దాని జీవితం ఆదిలోనే మోడైపోయింది" అని చేతులో చేయి వేయించుకుంది. అంతె! అదే ఆమె అంతిమ కోరిక.

తనభార్యచావు తనపై పిడుగుపాటులా వుందనుకున్నాడు, రాఘవరావు. ఇంట్లో దిక్కులేనికూతరు! దానిచేత పనిచేయిస్తే ఏమనుకుంటుందో!– అందులో తల్లిమరణం తర్వాత తనకూతురు బెంగతో కుమిలిపోతోందికూడాను.

ఒకనాడు భోజనాలదగ్గర అతనే "చూడమ్మా ఊళ్ళో అంతా నన్ను వేధించుకుని తింటున్నారు. మీ అమ్మ నన్ను జీవితంలో అర్ధాంతంగా ఏకాకినిచేసి వెళ్లిపోయింది... ... ... పట్టుమని నలభై ఏళ్లులేవు, రెండోపెళ్లి చేసుకో, ఆ అమ్మాయి నేం బాధిస్తావు, పాపం! అని అందరూ అంటున్నారు. చూడు, నువ్వుకూడా చిన్నపిల్లవు. అసలు నీబాధే ఈ పాపిష్ఠి కళ్ళతో చూడలేకుంటే, నీచేత పనికూడా ఏ మొహం పెట్టుకుని చేయించుకోను?" అన్నాడు. అందులో అనునయం కంఠంలో కన్పించేటట్లే స్వరాలు సరిచేశాడు.

తన చాకచక్యాన్ని, తెలివిని వినియోగించి కూతురు ముందు తన అభిప్రాయాన్ని పెట్టాడు. సుశీలేమీ అనలేదు.

కొంతసేపున్నాక "ఏమంటావే? అమ్మాయ్?," అనగానే అతను ఆశించినట్టే సుశీలకూడా అల్లాగే నాన్నా! నీ యిష్టం. నీకేది మంచిదనితోస్తే అదే చెయ్యి. నీకంటే నాకేం ఎక్కువ తెల్సునని?" అంది.

"చూసేవూ, నీకు తోడుగా వుండడానికే ఈద్వితీయం తలపెట్టేను" అని లేచేడు; అడుగుల్లో యవ్వనం కనిపించింది.

## 5

తండ్రి కొత్తభార్యతో దిగాడు. ఆవిడతోబాటు పదిమంది చుట్టాలు ప్రోగయ్యారు.

తనుమాత్రం వాళ్ళకు కనపడలేదు. ఊళ్లో అమ్మలక్కలు "శుభమల్లే వీళ్ళు కొత్తగా పెళ్ళాడి, గృహప్రవేశమవుతూంటే కనపడవద్దని హెచ్చరించారు. అందుకని తన గదిలో కూచుని, తల్లిని తల్చుకుని, ఏడవసాగింది. ఇతరులెవరైనా తన దు:ఖాన్ని గమనించి శాపనార్థాలు పెడతారేమోనని, సాధ్యమైనంతవరకూ తనలోనే దిగమింగుకోసాగింది.

తనతండ్రే వెతుక్కుంటూ వచ్చాడు; "చూడమ్మా! మీపిన్నీ వాళ్లూ వచ్చారు. వాళ్లు నాలుగురోజులబాటు ఉంటారు. వాళ్ళకి ఏమీ లోటుజరక్కూడదు. కాస్త దీనికి అలవాటయ్యే వరకూ నువ్వే అంతపనీ చెయ్యాలి తరవాత మీపిన్నే అన్ని పనులూ చేసుకుంటుంది" అంటూ అన్నీ మౌనంగావింది. మనసుని ఎవరో రంపపుకోత పెడుతున్నట్టుంది. తనతల్లిసవితికి తను చాకిరీ!

'పిన్ని... పిన్ని' అని గొణుక్కుంది. కాని తండ్రి ఆజ్ఞ! జవదాటలేదు. అందరికీ వున్న పదిరోజులూ అరవచాకిరీచేసింది.

ఏడాది గడిచింది. అన్ని పనులూ తనే చేస్తోంది. ఇంత చేసినా ఆయింట్లో ఎవరికీ కృతజ్ఞత ఉండేదికాదు.

"నాలుగురోజులు... అలవాటయ్యేవరకూ..." అన్న తన తండ్రి మళ్ళీ ఆమాటే ఎత్తలేదు.

"ఇంకా ఆ పిన్నిగారు తనను తోమసాగింది ఓ మనిషి లాగైనా చూట్టంలేదు. గౌరవం మాట సరికదా, ఎప్పుడూ సాధింపులూ, కసిరికొట్టడం, విసిరికొట్టడమూను.

ఒకరోజున కాఫీ కలిపిస్తే వీధిలో పారబోసింది. మరోరోజు ఫలహారం ప్లేటు గిరవాటేసి, పై పెచ్చు భర్తతో ఫిర్యాదు చేసింది.

తండ్రి "ఏమే! పిన్నిని అగౌరవపరుస్తున్నావుట! తల్లి లేనిదానివని పెత్తనమంతా ఇచ్చినందుకు గర్వమొచ్చిందా?" అని గదిమాడు.

పెత్తనంట బండచాకీరీ చెయ్యడం! తన బాధలెవరితో చెప్పుకుంటుంది? తనతండ్రి మాట్లాడేందుకే అవకాశమియ్యడు. ఇచ్చినా తను ధైర్యంచేసి చెప్పలేదు. చెబితే తన్నే ఎదురు తిట్టడని నమ్మకమేమిటి?

సుశీలకూడా మంచంపట్టింది. దానితో పెత్తనమంతా సవతితల్లిదే ఐంది. ఆరోగ్యం చెడుతుందనే పేరున తనకు తిండి తిప్పలులేకుండా చెయ్యసాగింది. ఆయుర్వేద కషాయాలతో తనని వేధించేది.

అసలుజబ్బు కొంత, అమ్మలేనిలోటు మరికొంతా, ఆజన్మవైధవ్యంవల్ల మరికొంతా అన్నీ కలసి కొద్దిరోజులలో సుశీలకు శాశ్వతంగా విముక్తి కల్గించాయి.

కూతురి అకాల మరణానికి రాఘవరావు కొంత చింతించినా కొంత సంతోషించాడు. ఆజన్మ వైధవ్యంతో బతకడం కంటె ఆడదానికి మరణమే మేలనుకున్నట్టున్నాడు. అందుకని త్వరలోనే తనను తానే ఓదార్చుకోగలిగాడు.

కొన్నాళ్ళ తర్వాత ఎక్కడో ఒక మీటింగ్‌లో చాలా పెద్ద ఉపన్యాస మిచ్చాడు.

"సోదరులారా!, మనదేశం గొప్ప ఆధ్యాత్మికదేశం. మన దేశౌన్నత్యమంతా మనం స్త్రీలకి ఇచ్చే గొప్పగౌరవం మీదే ఆధారపడివుంది. విదేశీయుల్లా మనం స్త్రీలని ఒక కామ యంత్రాల్లా చూడం, స్త్రీని గృహలక్ష్మిగా, మాతృదేవత, ప్రేమమూర్తిగా కొలిచి పూజిస్తాము.

"దానిక్కారణం మనస్త్రీలలోని నిస్వార్థ సేవాపరాయణత్వమే! ఉదాహరణగా మా అమ్మాయి సంగతి చెబుతాను వినండి. పాపం చిన్నతనంలోనే భర్తపోయినా, మనోవాక్కాయ కర్మలతో, అతన్నే దైవంగా తల్చుకుంటూ రోజులు వెళ్ళదీసి, చివరకి ఏ స్వర్గంలోనో వున్న భర్తనిచేరింది; ఇలాంటి త్యాగధనులెన్ని ఎంతో మందిని భారతమాత పుత్రికలుగా చూపగలదు".

ఆ సంస్కారి మాటలను విన్న సుశీల ఆత్మ బహుశా ఇలా అనుకుని వుంటుంది. ఆడదాని ప్రసక్తి వచ్చినప్పుడు మగవాళ్ళంతా ఒక్కటే - తండ్రి, భర్తా, కొడుకూ - ఏ రూపంలో వున్నా - కఠినాత్ములే! అని.